

# అంతర్జాతీయ అంశాలు

INTERNATIONAL ISSUES

### జర్మనీలో స్వలింగ వివాహాలకు చట్టసమ్మతి

స్వలింగ వివాహాలకు జర్మన్‌లో చట్టబద్ధత లభించింది. స్వలింగ సంపర్కుల వివాహం అంశంపై ప్రవేశపెట్టిన బిల్లుకు జర్మనీ పార్లమెంటు 2017 జూన్ 30న ఆమోదం తెలిపింది. జర్మనీ ఛాన్సలర్ ఎంజెలా మెర్కెల్‌తో సహా ఆమె పార్టీలోని పలువురు ఈ బిల్లును వ్యతిరేకించినప్పటికీ ఈ బిల్లు ఆమోదం పొందింది. 'లింగభేదంతో సంబంధం లేకుండా ఎవరైనా ఇద్దరు వ్యక్తులు ఒక జీవితంలోకి ప్రవేశించేందుకు చేసుకునేది పెళ్లి.' అంటూ చట్ట సవరణ చేశారు. ఈ చట్టం ద్వారా స్వలింగ సంపర్కులకు కేవలం వివాహ అవకాశం మాత్రమే కాకుండా పిల్లలను కూడా దత్తత తీసుకునే అవకాశం ఇచ్చింది. 2017 చివరినాటికి ఈ చట్టం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

### యూరప్ దేశాలపై భారీ సైబర్ దాడి

సైబర్ ఉగ్రవాదులు మరోసారి దాడికి తెగబడ్డారు. ర్యాన్సమ్‌వేర్ వైరస్‌తో 2017 జూన్ 27న మరోమారు యూరప్ దేశాలపై విరుచుకుపడ్డారు. దీంతో రష్యా, ఉక్రెయిన్, బ్రిటన్, స్పెయిన్ తదితర దేశాల్లో కార్యకలాపాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నెల రోజుల కిందటే ప్రపంచమంతా ర్యాన్సమ్‌వేర్ వాన్నాక్రై వైరస్ ధాటికి విలవిలలాడిన పరిస్థితి తెలిసిందే. ఈ సైబర్ దాడితో అన్ని దేశాలకంటే ఎక్కువగా నష్టపోయింది ఉక్రెయినే అని ఆ దేశ ప్రధాని అన్నారు. ఎయిర్‌పోర్టు, కంపెనీల కార్యాలయాలన్నీ దాడికి గురయ్యాయని, గతంలో ఎప్పుడూ ఇంత నష్టాన్ని చవిచూడలేదని పేర్కొన్నారు.

### ఐఎస్ జైలుపై వైమానిక దాడులు

ఐఎస్ ఉగ్రవాద సంస్థ తూర్పు సిరియాలో నిర్వహిస్తున్న జైలుపై అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు 2017 జూన్ 26న జరిపిన వైమానిక దాడుల్లో 57 మంది మృతి చెందారు. డెయిర్ ఎజోర్ తూర్పు ప్రావిన్సులోని మాయాదీన్ ప్రాంతంలో జరిపిన ఈ దాడుల్లో 42 మంది ఖైదీలు, 15 మంది జిహాదీలు హతమైనట్లు సిరియాకు చెందిన మానవహక్కుల సంస్థ తెలిపింది.

### అమెరికాలో అమల్లోకి ట్రావెల్ బ్యాన్




ముస్లింల ఆధిక్యమున్న 6 దేశాల నుంచి అమెరికాలోకి రాకపోకలను నిషేధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెచ్చిన కొత్త ఉత్తర్వులు 2017 జూన్ 30 నుంచి అమల్లోకి వచ్చాయి. 2017 జనవరిలోనే ట్రంప్ ప్రభుత్వం ఈ ఆంక్షలను తెచ్చినప్పటికీ న్యాయస్థానాల ఆదేశాలతో అవి వెనక్కిపోయాయి. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కారణంగా ఆంక్షల్లో కొంత భాగం పాటు అమలు చేయడానికి వీలు కలిగింది. ఈ నేపథ్యంలో ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, సిరియా, యెమన్‌ల నుంచి వచ్చే సందర్శకులపై 90 రోజులపాటు, శరణార్థులపై 120 రోజుల పాటు నిషేధం ఉంటుంది. అయితే అమెరికాలో సన్నిహిత కుటుంబ సభ్యులు ఉన్నవారికి మినహాయింపులు ఇచ్చారు. తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, సంతానం, అల్లుడు, కోడలు, తోబుట్టువులు, సవతి సోదరులను మాత్రమే సన్నిహిత కుటుంబ సభ్యులుగా పరిగణిస్తున్నారు. ఉగ్రవాదులను దేశంలోకి రానివ్వకుండా అడ్డుకోవడానికి ఈ ఆంక్షలను తెచ్చినట్లు ట్రంప్ సర్కారు పేర్కొంది.

Vyoma Current Affairs N Santhoshkumar

## తెహ్రీక్-ఏ-ఆజాదీ జమ్మూకశ్మీర్‌పై పాకిస్థాన్ నిషేధం

అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఏ-ఆజాదీ జమ్మూ కశ్మీర్(TAJK)పై పాకిస్థాన్ నిషేధం విధించింది. ఇది ఉగ్రవాద నాయకుడు, ముంబయి దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు చెందిన జమాతుద్ దవాకు ముసుగు సంస్థ. 2017 జనవరి చివర్లో సయీద్‌ను పాక్ ప్రభుత్వం గృహ నిర్బంధంలో ఉంచింది. JUDని పరిశీలన జాబితాలో ఉంచింది. అయితే ఈ చర్యను తీసుకోబోతున్నట్లు సయీద్‌కు ముందే ఉప్పందినట్లు స్పష్టమవుతోంది. TAJKను స్థాపించబోతున్నట్లు అతడు అంతకుముందే సూచనప్రాయంగా చెప్పాడు. భారత్‌ను లక్ష్యంగా చేసుకొని జేయూడీ సాగించే కొన్ని కార్యకలాపాలను ఈ ముసుగు సంస్థ TAJKకు బదలాయించడం కూడా మొదలుపెట్టాడు. సయీద్‌కు గృహ నిర్బంధం విధించిన కొద్దిరోజుల తర్వాత అంటే 2017 ఫిబ్రవరి 5న కశ్మీర్‌కు స్వాతంత్ర్యం ఇవ్వాలంటూ పాకిస్థాన్ వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించినప్పుడు TAJK వార్తల్లోకి ఎక్కింది. TAJKపై 2017 జూన్ 8న నిషేధం విధించినట్లు పాకిస్థాన్ జాతీయ ఉగ్రవాద నిరోధక ప్రాధికార సంస్థ వెబ్‌సైట్ పేర్కొంది. దీనికితోడు జైషే మహ్మద్, అల్‌ఖైదా, తెహ్రీక్ ఏ తాలిబన్, జేయూడీకి చెందిన సాయుధ విభాగం లష్కరే తొయిబా తదితర 64 సంస్థలపై కూడా కొరడా ఝుళిపించింది. స్పెయిన్‌లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(FATF) సమావేశానికి కొద్దిరోజుల ముందు పాక్ ఈ చర్యను చేపట్టింది. ఉగ్ర ముఠాలపై గట్టి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఇప్పటికే FATF దృష్టి పెట్టింది. మనీ లాండరింగ్, ఉగ్ర నిధులు వంటి అంశాలపై న్యాయ, నియంత్రణపరమైన చర్యలు చేపట్టడానికి FATF ఏర్పాటైంది. నిజానికి ఉగ్రవాద నిధులకు సంబంధించిన అంశాన్ని భారత్ 2017 ఫిబ్రవరిలో FATF ద్ద లేవనెత్తింది. దీన్ని FATF పాకిస్థాన్‌కు నివేదించింది. దీనికితోడు అమెరికాలోని ట్రంప్ సర్కారు కఠిన వైఖరి అవలంబించబోతోందని, పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై డ్రోన్ దాడులకూ సిద్ధమవుతోందని తెలుసుకొని ఈ చర్య తీసుకొంది.

TAJK-Tehreek Azadi Jammu and Kashmir

JUD-Jamaat-Ud-Dawa

FATF-Financial Action Task Force

## ఫేస్‌బుక్ వినియోగదారులు 200 కోట్ల మంది

ప్రముఖ సామాజిక మీడియా నెట్‌వర్క్ 'ఫేస్‌బుక్'ను ప్రతి నెల చురుగ్గా వాడేవారి సంఖ్య 200 కోట్లకు చేరింది. ఫేస్‌బుక్ వైస్ ప్రెసిడెంట్ నవోమి గ్లీట్ 2017 జూన్ 27న ఈ విషయాన్ని వెల్లడించారు. తాజా సమాచారాన్ని బట్టి చూస్తే ప్రపంచ జనాభాలో 4వ వంతుకు పైగా ఫేస్‌బుక్‌లో ఉన్నారు.

## ట్రంప్ అభిశంసన కోరుతూ తొలి తీర్మానం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉద్వాసనను కోరుతూ తొలి అభిశంసన అభియోగం దాఖలైంది. కాలిఫోర్నియాకు చెందిన డెమొక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల ఆధిక్యం ఉన్నందున ఈ తీర్మానం నిలిచిపోయే అవకాశం ఉంది. అమెరికా ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలకు సంబంధించి దర్యాప్తులో న్యాయ ప్రక్రియకు అవరోధం కలిగిస్తున్నారని తీర్మానంలో ఆరోపించారు.

## సోదరుడి కుమారుణ్ని అరెస్టు చేయించిన మాల్దీవుల దేశాధ్యక్షుడు

మాల్దీవులులో ప్రభుత్వాన్ని కూల్చేందుకుగాను రాజకీయ నేతలకు ముడుపులు అందజేశారన్న ఆరోపణలపై ఎంపీ ఫారిస్ మౌమూన్‌ను దేశాధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ 2017 జులై 18న అరెస్టు చేయించారు. యమీన్‌కు సవతి సోదరుడైన మౌమూన్ అబ్దుల్ గయూమ్ యొక్క కుమారుడు ఫారిస్. అబ్దుల్ గయూమ్ 30 సం॥ల పాటు మాల్దీవుల అధ్యక్షుడిగా ఉన్నారు.

## పాకిస్థాన్‌కు సీఎస్ఎఫ్ నిధులు నిలిపివేత

అఫ్గాన్‌లో ఉగ్రదాడులకు పాల్పడటంతో పాటు తాలిబన్లకు మద్దతిస్తున్న హఖానీ సభ్యుల ఏరివేతకు పాకిస్థాన్ తగిన చర్యలు తీసుకోవటంలేదని భావించిన అమెరికా దాదాపు రూ.2275 కోట్ల సంకీర్ణ మద్దతు నిధుల(సీఎస్ఎఫ్) మంజూరును నిలిపివేసింది.

## బ్రిటన్‌లో కొత్త పెట్రోల్, డీజిల్ కార్లపై నిషేధం

కొత్త డీజిల్, పెట్రోల్ కార్లు, వ్యాన్లపై బ్రిటన్ నిషేధం విధించింది. ఈ వాహనాల అమ్మకాలను 2040 నుంచి నిషేధిస్తున్నట్లు యూకే పర్యావరణ సెక్రటరీ మైఖేల్ గోవ్ ప్రకటించారు. ఎన్నో రోజుల నుంచి వేచిచూస్తున్న ఎయిర్ క్వాలిటీ ప్లాన్‌ను 2017 జులై 26న బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది.